సాక్షి
వనపర్తి
బుధవారం । 20 । నవంబర్ । 2024



ఉద్యాన సాగుకు..
రైతులు ఉద్యాన సాగుకు ఆసక్తి చూపుతున్నా.. వారిని ప్రోత్సహించే వారు కరువయ్యారు.
వివరాలు 8లో ▸



వైభవంగా ఆరుద్రోత్సవం
జోగుళాంబ ఆలయంలో మంగళవారం ఆరుద్రోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.
వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
33.0 /15.7

వాతావరణం
రోజురోజుకు చలి తీవ్రత కాస్త పెరుగుతుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. చల్లటి గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

డిసెంబర్ 14న మెగా లోక్ అదాలత్

వనపర్తిటౌన్: డిసెంబర్ 14న నిర్వహించే మెగా జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత కోరారు. మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలో పోలీసులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజీకి అనుకూలంగా ఉన్న క్రిమినల్ కేసులు, చెక్‌బౌన్స్, ఎక్సైజ్, డ్రంకెన్‌డ్రైవ్, చలానా, చిన్న చిన్న కేసులు పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్‌ను వినియోగించుకునేలా చూడాలన్నారు. రాజీతో ఇరువర్గాలకు మేలు చేకూరడమేగాక ప్రశాంతంగా జీవించవచ్చని చెప్పారు. ఈ నెల 23, 30, వచ్చే నెల 7న ముందస్తు లోక్‌అదాలత్‌లు జరుగుతాయని తెలిపారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వి.రజని, న్యాయమూర్తులు రవికుమార్, బి.శ్రీలత, వై.జానకి, డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ విధిగా ధరించాలి : ఎస్పీ



వనపర్తి: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని ఎస్పీ రావుల గిరిధర్ సూచించారు. మంగళవారం జిల్లాకేంద్రంలో ప్రేమ్ టైలర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఎస్పీ హాజరై పలువురికి ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. వాహనదారులు సురక్షితంగా తమ గమ్యాన్ని చేరేందుకు హెల్మెట్ ధరించాలన్నారు. రెండు జతల దుస్తులు కుట్టించుకున్న వారికి ఉచితంగా హెల్మెట్ అందిస్తున్నట్లు నిర్వాహకుడు మన్యం తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ కృష్ణ, ఎస్‌ఐలు హరిప్రసాద్, జలంధర్‌రెడ్డి, ట్రాఫిక్ ఏఎస్సై నిరంజన్, రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రెసిడెంట్ చిన్నమ్మ థామస్, సఖి సెంటర్ కార్యనిర్వాహకురాలు కవిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పురాణాల గురించి తెలుసుకోవాలి



వనపర్తి టౌన్: భారతీయ సమాజంలో ఇమిడి ఉన్న పురాణాల గురించి విద్యార్థి లోకం తెలుసుకోవాల్సిన అవసరం ఉందని తెలుగుభాషా సంరక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె.నారాయణరెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో కర్ణుడు, ద్రోణుడు, శ్రీరాముడు, ఆంజనేయుడు, అర్జునుడు, అభిమన్యుడు తదితర మహనీయుల వ్యక్తిత్వం తెలిపే సమగ్ర పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేసి మాట్లాడారు. పురాణ పురుషుల గురించి విద్యార్థులు క్షుణ్ణంగా తెలుసుకుంటే కార్యసాధన, వ్యక్తిత్వం, సారవంతమైన జీవితాన్ని గడపవచ్చని వివరించారు. మానవ, నైతిక విలువలు అబ్బుతాయని, తద్వారా సమాజం మెరుగుపడుతుందన్నారు. కష్టం వచ్చినప్పుడు కుంగిపోకుండా స్థిరత్వంగా ఉండేందుకు రామాయణం, భారతం, భాగవతాలు మనిషిని నిలబెడుతాయన్నారు. కార్యక్రమంలో వ్యాఖ్యాత డీవీవీఎస్ నారాయణ, రాజవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

'మతోన్మాద శక్తుల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకుందాం'

వనపర్తి రూరల్: మతోన్మాద శక్తుల నుంచి తెలంగాణను కాపాడుకుందామని సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సీపీఎం, సీపీఐ, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని మాట్లాడారు. శ్రామికుల ఐక్యతను బలోపేతం చేస్తూ మత సామరస్యాన్ని కాపాడుకుందామన్నారు. వామపక్ష పార్టీల రాష్ట్ర కమిటీలు ఇచ్చిన పిలుపు మేరకు 24వ తేదీన జిల్లాకేంద్రంలోని యాదవ భవన్‌లో సమావేశం నిర్వహించాలని నిర్ణయించామన్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల తర్వాత ప్రజల మధ్య మతపరమైన విభేదాలు పెంచేందుకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. మెజార్టీ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయని, ప్రజలపై ధరల భారం, నిరుద్యోగం పెంచుతున్నాయన్నారు. మతోన్మాద రాజకీయాలకు తెలంగాణ గడ్డమీద స్థానం లేదని చాటి చెబుదామని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యులు మండ్ల రాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి హన్మంతు, సీపీఎం పట్టణ కార్యదర్శి పరమేశ్వరాచారి, సీపీఐ పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ, రమేశ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

15 రోజులైన కొనుగోలు చేయలేదు..



ఈ ఫొటోలో కనిపిస్తున్నది నారాయణపేట జిల్లా కృష్ణ మండలం హిందూపూర్ గ్రామానికి చెందిన రైతు మహేష్. కృష్ణలోని కొనుగోలు కేంద్రానికి 15 రోజుల క్రితం ధాన్యాన్ని తీసుకొచ్చారు. ఇప్పటివరకు ఆ ధాన్యాన్ని కొనుగోలు లేదు. దీంతో చేసేది లేక ఒకట్రెండు రోజులు చూసి కర్ణాటక మిల్లర్లకు విక్రయించాలనుకుంటున్నాడు. 14 శాతం తేమ వచ్చినప్పటికీ ధాన్యంను కొనుగోలు చేయడం లేదంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరబెట్టడంతోనే సరిపోతుంది..



నా పేరు రాము. మాది వనపర్తి జిల్లా అమరచింత మండలం కిష్టంపల్లి. నేను నాలుగున్నర ఎకరాల్లో వరి సాగు చేశా. పండిన ధాన్యాన్ని గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లగా తేమ శాతం 14 వచ్చే వరకు ఆరబెట్టమన్నారు. నేటికి 4 రోజులు అవుతున్నా తేమశాతం రాలేదు.

ఊపందుకోని కొనుగోళ్లు

ఉమ్మడి జిల్లాలో ఇంకా పూర్తిస్థాయిలో ప్రారంభం కాని ధాన్యం కేంద్రాలు

- చాలాచోట్ల తేమశాతం పేరుతో ముందుకు సాగని వైనం
- సింహభాగం ప్రైవేటు వ్యాపారులకే తరలుతున్న సన్నాలు
- ప్రభుత్వం ఇచ్చే బోనస్ కోల్పోతున్న రైతులు

సాక్షి, నాగర్‌కర్నూల్:

ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు ఇంకా ఊపందుకోలేదు. ఉమ్మడి జిల్లాలో అన్ని చోట్ల కేంద్రాలను ప్రారంభించామని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. చాలాచోట్ల ఇప్పటివరకు ధాన్యం సేకరణ మొదలుపెట్టలేదు. తేమశాతం పేరుతో కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకే ఎక్కువగా విక్రయిస్తున్నారు. ఓ వైపు కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో ప్రారంభం కాకపోవడం, నిర్ణీత తేమ శాతం వచ్చే వరకు ఆరబోసేందుకు వీలుకాక తక్కువ ధరకే ప్రైవేటుకు అమ్ముకుని నష్టపోతున్నారు. ఈసారి సన్నరకం వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 చొప్పున ప్రభుత్వం బోనస్ ధరను ప్రకటించినప్పటికీ చాలామంది రైతులు ప్రైవేటుకు విక్రయిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వం ప్రకటించిన బోనస్ ధరను లబ్ధిపొందలేకపోతున్నారు.



పాన్‌గల్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబెడుతున్న రైతులు (ఫైల్)



మాగనూరులో వెలవెలబోతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రం

సాక్షి ఫోకస్

నామమాత్రంగా కొనుగోళ్లు..

ఉమ్మడి జిల్లాలో అన్ని చోట్ల ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఆయా కేంద్రాల్లో క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు మాత్రం మొదలు కాలేదు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఇప్పటివరకు అత్యధికంగా మహబూబ్‌నగర్ జిల్లాలో 8,360 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, మిగతా చోట్ల కొనుగోళ్లు నెమ్మదిగా సాగుతున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇప్పటివరకు కేవలం 564 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే అధికారులు సేకరించారు. వనపర్తి జిల్లాలో 3,266 మెట్రిక్ టన్నులు, నారాయణపేట జిల్లాలో 3,107 మెట్రిక్ టన్నులు, జోగుళాంబ గద్వాల జిల్లాలో 750 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే సేకరించారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్ణీత తేమ శాతం 14 లోపు ఉంటేనే అధికారులు కొనుగోలు చేస్తున్నారు. కొన్ని చోట్ల తేమశాతం ఉన్నా కొనుగోళ్లు మాత్రం ప్రారంభించడం లేదని రైతులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల వివరాలు

జిల్లా	కొనుగోలు కేంద్రాలు	ప్రా. కొ.కే.	ఇప్పటివరకు కొన్న ధాన్యం (మెట్రిక్ టన్నుల్లో)
మహబూబ్‌నగర్	189	189	8,360.60
నాగర్‌కర్నూల్	252	252	564
వనపర్తి	262	183	3,266
జోగుళాంబ గద్వాల	64	64	750
నారాయణపేట	101	101	3,107

ప్రా.కొ.కే.: ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలు

ప్రైవేట్‌లోనే అమ్ముకున్నా..



నేను ఈసారి ఎకరాన్నరలో సన్నరకం వరి సాగు చేశాను. మా గ్రామంలో ఇప్పటి వరకు ప్రభుత్వ కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. దీంతో 30 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని క్వింటాల్‌కు రూ.2,400 చొప్పున తక్కువ ధరకే ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకున్నాను. మా ఊరిలో కేంద్రం ప్రారంభం కాక చాలామంది రైతులు ప్రైవేటు వ్యక్తులకే అమ్ముకుంటున్నారు.
– బాలయ్య, రైతు, రాయిపాకుల, తెలకపల్లి మండలం

తేమశాతం ఉండట్లేదు..

జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. నిర్ణీత తేమశాతం కలిగిన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాల్సి ఉండగా ఇందుకు సమయం పడుతోంది. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం ఇస్తున్న బోనస్ కేవలం రెండు రోజుల్లోనే వారి ఖాతాల్లో జమ అవుతోంది. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నాం.
– రాజయ్య, జిల్లా పౌర సరఫరాశాఖ మేనేజర్, నాగర్‌కర్నూల్

ప్రైవేటుకు తరలుతున్న ధాన్యం..

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వస్తున్న ధాన్యం కన్నా ప్రైవేటు వ్యాపారుల చేతుల్లోకే ఎక్కువ ధాన్యం తరలుతోంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు ఆలస్యంగా కొనసాగడం, రోజుల తరబడి రైతులు నిరీక్షించలేక ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయిస్తున్నారు. ఈసారి ప్రభుత్వం సన్నరకం వడ్లకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ అందిస్తోంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,300 ఇస్తుండగా, సన్న రకం ధాన్యానికి అదనంగా రూ.500 అందిస్తోంది. బోనస్ ధరతో కలుపుకుని సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2,800 రైతులకు అందించాల్సి ఉంది. ఈ మొత్తాన్ని కేవలం రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో జమచేస్తామని ప్రభుత్వం చెబుతోంది. రైతు నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసిన 24 గంటల్లోగా కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.2,300 రైతు ఖాతాలో జమ అవుతాయని, మరుసటి రోజున 24 గంటల్లోపు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ డబ్బులు రైతుఖాతాలో జమ అవుతాయని అధికారులు చెబుతున్నారు. అయితే చాలాచోట్ల రైతులు మాత్రం ప్రభుత్వం కొనుగోలు చేసేంత వరకు నిరీక్షించకుండా తక్కువ ధరకే ప్రైవేటు వ్యక్తులకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం ఇస్తున్న ధర కన్నా రూ.300 నుంచి రూ.500 వరకు తక్కువగా ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేస్తుండటంతో రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు ముమ్మరం చేయాలని, సకాలంలో ధాన్యం డబ్బులు రైతుల ఖాతాలో జమచేయాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పాలిథిన్ కవర్లు, టార్పాలిన్లు



నేను మూడు ఎకరాల్లో సన్న వడ్లు సాగు చేశాను. పండించిన పంటను రెండు రోజుల క్రితం మార్చాల కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకురాగా.. 14 లోపు తేమ శాతం వచ్చే వరకు కేంద్రంలో ఆరబోయాలని చెప్పారు. కానీ, పాలిథిన్ కవర్లు, టార్పాలిన్లు అందుబాటులో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారులు స్పందించి వాటిని వెంటనే సమకూర్చాలి.
– లక్ష్మీదేవి, మహిళా రైతు, మార్చాల, కల్వకుర్తి మండలం

అటవీ అధికారులతో ఎంపీ, ఎమ్మెల్యే సమావేశం

వనపర్తి: నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల అనుమతులపై హైదరాబాద్‌లో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేకంగా అటవీశాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వివిధ ప్రాజెక్టుల కోసం అవసరమైన భూమి కేటాయింపులు, అనుమతులపై చర్చించారు. అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డోబ్రియల్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వనపర్తి–రాజపేట తండా మార్గం (కొత్తకోట–ఆత్మకూరు రోడ్డుకు అనుసంధానం), వనపర్తి పాలకేంద్రం నుంచి అంజనగిరి వరకు బైపాస్ రోడ్డు (కొల్లాపూర్ రోడ్డుకు అనుసంధానం) ఈ ప్రాజెక్టులకు 17.139 హెక్టార్ల భూమి కేటాయింపు.. స్పోర్ట్స్ స్కూల్ నిర్మాణానికి సర్వేనంబర్ 86లో 12.08 ఎకరాలు, సర్వేనంబర్ 25లో 0.12 ఎకరాల భూమి.. అంజనగిరితండాకు బీటీ రహదారి నిర్మాణానికిగాను సర్వేనంబర్ 6లో 0.69 హెక్టార్ల భూసేకరణ.. వనపర్తి 8వ వార్డు శ్రీనివాసాపురంలో శ్మశానవాటికకు ఎకరం, హాకీ స్టేడియానికి సర్వేనంబర్ 56లో 5 ఎకరాల కేటాయింపుపై చర్చించారు. జిల్లా అటవీశాఖ అధికారి రామాంజనేయులు పాల్గొన్నారు.

పంట కొయ్యలను తగులబెట్టొద్దు : డీఏఓ

పాన్‌గల్: వానాకాలంలో సాగుచేసిన వరి, పత్తి పంటల కోతల తర్వాత ఉండే కొయ్యలను ఎట్టి పరిస్థితుల్లో తగులబెట్టొద్దని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్‌నాయక్ రైతులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంట కొయ్యలు, అవశేషాలను తగులబెట్టడంతో వాతావరణ కాలుష్యం ఏర్పడటంతో పాటు పొలంలోని పోషకాలను నష్టపోతామన్నారు. కొయ్యలను నేలలోనే కలియ దున్నడంతో భూసారం, పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏఓ రాజవర్ధన్‌రెడ్డి, ఏఈఓలు అఖిల, శైలజ, వెంకటేశ్, షర్మిలాదేవి, నరేశ్, రైతులు పాల్గొన్నారు.



రైతునేస్తంలో పాల్గొన్న అధికారి గోవింద్‌నాయక్

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వద్దు

- విధిగా నిబంధనలు పాటించాలి
- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా త్వరగా ధాన్యం సేకరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని నిబంధనలకు అనుగుణంగా తేమ శాతం ఉంటేనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని, ఆన్‌లైన్ నమోదు చేయాలని సూచించారు. మిల్లర్లు తీసుకున్న ధాన్యానికి సంబంధించిన రసీదు రెండురోజుల్లో తీసుకోవాలని, ఏదేని కారణంతో ధాన్యాన్ని తిరస్కరిస్తే వెంటనే సంబంధిత ఏఈఓలు వెళ్లి సమస్య పరిష్కరించాలని సూచించారు. ధాన్యం తూర్పారబట్టనికి ప్రతి కేంద్రంలో ఫ్యాన్లు, టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి, మెప్మా, సహకార సంఘాలు, అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూడాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు, డీఎస్‌ఓ విశ్వనాథ్, డీఏఓ గోవింద్‌నాయక్, డీసీఓ ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు, స్వచ్ఛతపై దృష్టి..

జిల్లాలో తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో తాగునీరు, పారిశుద్ధ్య కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. జిల్లాలో మరుగుదొడ్లు లేని ఇళ్లు 365 ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. మరుగుదొడ్డి లేని ఇల్లు ఉండొద్దని.. పేదలు స్వచ్ఛభారత్ పథకంలో ఉచితంగా మరుగుదొడ్లు నిర్మించుకునేలా చూడాలన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇంకుడు గుంతలు, అన్ని గ్రామాల్లోని మురుగు కాల్వల చివర్లో కమ్యూనిటీ ఇంకుడు గుంతలు నిర్మించాలని సూచించారు. ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని.. 50 మైక్రాన్ కంటే తక్కువ నాణ్యతతో ఉన్న ప్లాస్టిక్ సంచులను విక్రయించినా, వినియోగించినా జరిమానాలు విధించాలన్నారు. సేకరించిన తడి చెత్తతో సేంద్రియ ఎరువులు తయారు చేసేలా చర్యలు తీసుకోవాలని, ప్రజల సౌకర్యార్థం మండల కేంద్రాల్లో సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని.. నీటి పరీక్షలు నిర్వహిస్తూ స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డీఆర్డీఓ ఉమాదేవి, మిషన్ భగీరథ డీఈఈ మేఘారెడ్డి, డీఏఓ గోవింద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ కళాయాత్ర..

ప్రజాపాలన ప్రారంభమై ఏడాది పూర్తయిన సందర్భంగా జిల్లాకేంద్రంలో మంగళవారం విజయోత్సవ కళాయాత్రను కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రారంభించారు. జిల్లాలో ఈ యాత్ర డిసెంబర్ 7 వరకు కొనసాగుతుందని.. ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరిస్తూ చైతన్యం చేస్తుందని చెప్పారు. డిసెంబర్ 6న రాష్ట్ర సాంస్కృతికశాఖ నుంచి నాగరాజు కళాబృందం జిల్లాలో భారీ కళా ప్రదర్శన నిర్వహించి విజయోత్సవ ర్యాలీని ముగించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీపీఆర్‌ఓ సీతారాం, డీపీఓ సురేశ్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మమ్మ, ఏఓ భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి.. హాజరైన అధికారులు

పురం.. ఆర్థిక భారం



వేతనాల కోసం పురపాలిక ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు (ఫైల్)

నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న వనపర్తి పురపాలిక

- కార్మికులకు వేతనాలు చెల్లించలేని దుస్థితి
- రేపు కార్యాలయ దిగ్బంధానికి కార్మిక సంఘం నిర్ణయం

కార్మికుల సంఖ్య	కావాల్సిన నిధులు
ప్రతినెల వేతనానికి 236	సుమారు రూ. 60 లక్షలు
జనరల్ ఫండ్‌లో నిల్వ : రూ. 8 లక్షలు	

వనపర్తి టౌన్: వనపర్తి పురపాలిక కేవలం ఆస్తి పన్ను ఆదాయంపైనే ఆధారపడటంతో గడ్డు పరిస్థితి ఎదుర్కొంటుంది. సరిగ్గా 14 ఏళ్ల కిందటి పరిస్థితులు పునరావృతం అవుతున్నాయి. పుర జనరల్ ఫండ్ ఖాతాలో కనీస నిల్వలు లేక ఆర్థిక భారంతో కొట్టుమిట్టాడుతోంది. జనరల్ ఫండ్ నిల్వలు తొలి ప్రాధాన్యతగా కార్మికులకు వేతనాలు ఇవ్వాలి. ఈ నిధులను గతంలో ఇష్టారీతిన దారి మళ్లించడం, పన్ను వసూళ్లలో వెనుకంజ, ఇతర ఆదాయ మార్గాలపై దృష్టి సారించకపోవడంతో ఆర్థిక భారం నెలకొంది. నిబంధనల ప్రకారం జనరల్ ఫండ్ ఖాతాలో రూ.కోటి వరకు నిల్వ ఉండాలి. కానీ అలాంటి పరిస్థితి ఈ పురపాలికలో ఎనిమిది నెలలుగా కనిపించడం లేదు. పురపాలికలో కార్మికులు మొత్తం 236 మంది ఉన్నారు. వీరందరూ ప్రతి నెల వచ్చే వేతనంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వీరందరికి కలిపి ప్రతి నెల రూ.60 లక్షల వరకు వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో నవంబర్ 19 వరకు జనరల్ ఫండ్‌లో కేవలం రూ.8 లక్షలు మాత్రమే ఉన్నాయి.



వనపర్తి పురపాలికలో డ్రెయినేజీని శుభ్రం చేస్తున్న కార్మికులు (ఫైల్)

కార్మికుల ఆందోళన..


పదేళ్లుగా కార్మికులకు ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలిస్తూ వచ్చారు. గత ఆరు నెలలుగా వేతనాల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో కార్మికులు ఆందోళన బాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు. స్వచ్ఛ పురపాలికగా తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తున్న తమకు వేతనాలు సకాలంలో చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యావసర సరుకులు, పిల్లల ఫీజులు, చిన్న చిన్న ఈఎంఐలు సకాలంలో చెల్లించకపోతున్నామని.. తప్పని పరిస్థితుల్లో అప్పులు చేయాల్సి వస్తోందని చెప్పారు. కార్మికుల బకాయి వేతనాలు చెల్లించకపోతే 21వ తేదీ కార్యాలయ దిగ్బంధం చేపట్టేందుకు కార్మిక సంఘం నాయకులు నిర్ణయించారు.

తీరని అన్యాయం..



కార్మికులకు వేతనాల చెల్లింపుపై పుర అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. నెలవారి వేతనంతో కుటుంబాన్ని నెట్టుకొచ్చే కార్మికులకు గత ఆరునెలలుగా సకాలంలో అందడం లేదు. బుధవారం వేతనాలు ఇవ్వకపోతే గురువారం నుంచి కార్యాలయాన్ని దిగ్బంధం చేస్తాం. అధికారులు, ఉద్యోగులు ఒకటో తేదీన వేతనాలు తీసుకుంటే కార్మికులకు చెల్లింపుల్లో చెల్లింపుల్లో జాప్యమెందుకు?
– పుట్టా ఆంజనేయులు, పుర కార్మిక సంఘం ప్రతినిధి

చెల్లింపునకు చర్యలు..



పుర కార్మికులకు వేతనాలు త్వరగా చెల్లించేందుకు చర్యలు చేపట్టాం. ఈ మేరకు ఆస్తి పన్ను వసూళ్లలో వేగం పెంచాం. గతంలో జనరల్ ఫండ్ నిధులను ఇష్టారీతిగా దారి మళ్లించడంతోనే ఈ దుస్థితి నెలకొంది. కార్మికులకు ప్రథమ ప్రాధాన్యతలో వేతనాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వీలైనంత త్వరగా వేతనాలు చెల్లిస్తాం.
– పూర్ణచందర్, పుర కమిషనర్, వనపర్తి

క్లుప్తంగా

చింతచెట్టు పైనుంచి పడి వృద్ధుడు మృతి


కోరమోని లక్ష్మయ్య (ఫైల్)

గోపాల్‌పేట: చింత చెట్టు పైనుంచి పడి ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేటలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన కోరమోని లక్ష్మయ్య (56) చింత, మామిడి చెట్లు గుత్తాకు తీసుకొని వాటి కాయలు విక్రయించి వచ్చిన ఆదాయంతో జీవనం సాగించేవాడు. మంగళవారం మధ్యాహ్నం లక్ష్మయ్య ఇంటి పక్కనున్న చెట్టుకు చింతకాయలు తెంపేందుకు ఎక్కి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. సాయంత్రం చుట్టుపక్కల వారు గుర్తించి ద్విచక్ర వాహనంపై స్థానిక పీహెచ్‌సీకి అటు నుంచి వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారని అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ నరేశ్ తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలకార్మికుడు..

అచ్చంపేట రూరల్: విద్యుదాఘాతానికి గురై ఓ బాలకార్మికుడు మృతి చెందిన ఘటన మంగళవారం అచ్చంపేటలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని ఓ టిఫిన్ సెంటర్‌లో భద్రాచలంకు చెందిన రాము (16) పనిచేసేవాడు. మంగళవారం పిండి రుబ్బుతుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. అక్కడే ఉన్న వారు గుర్తించి వెంటనే అచ్చంపేట ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. నాగర్‌కర్నూల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి..

మరికల్: మండలంలోని మాధవరం రోడ్డు పక్కన ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నారాయణపేటకు చెందిన కుర్వ వెంకటేష్(36) బంధువుల గృహప్రవేశం ఉందని మూడు రోజుల క్రితం గొర్రెల దగర నుంచి నారాయణపేటకు వచ్చాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి మరికల్‌కు వచ్చి మద్యం తాగి.. భార్య గ్రామమైన మాధవరానికి కాలినడకన వెళ్తుండగా మద్యం మత్తులో కిందపడి మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వెంకటేష్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై తల్లి సోభాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ ఎల్లయ్య తెలిపారు.

పోలీసులమని బెదిరించి.. డబ్బుల వసూలు

- కేసు నమోదు

లింగాల: తాము స్పెషల్ పోలీసులం అని బెదిరించి.. ఇసుక ట్రాక్టర్ యజమాని నుంచి డబ్బులు వసూలు చేసిన లింగాలకు చెందిన పూజారి భాస్కర్, మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు మంగళవారం తెలిపారు. వివరాలిలా.. పెద్దకొత్తపల్లి మండలం చంద్రబండకు చెందిన రవినాయక్ అనే వ్యక్తి అంబట్‌పల్లికి సోమవారం రాత్రి ఇసుకను తీసుకవస్తున్న సమయంలో.. ట్రాక్టర్‌ను ఆపిన వ్యక్తులు తాము స్పెషల్ పోలీసులమని బెదిరించి రూ.5 వేలు వసూలు చేశారు. దీనిపై ట్రాక్టర్ యజమాని రవినాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

ఉద్యాన సాగుకు ఊతమేది?

జిల్లాలో పెరుగుతున్న పండ్లు, కూరగాయల సాగు

- ఊసేలేని అధికారుల నియామకం
- అందని సూచనలు, సలహాలు
- ఇబ్బందులు పడుతున్న గ్రామీణ రైతులు

గండేడ్: పాలమూరు జిల్లా రైతులు ఉద్యాన సాగుకు ఆసక్తి చూపుతుండటంతో ఏటా విస్తీర్ణం పెరుగుతోంది. సంబంధిత అధికారులు అరకొరగా ఉండటంతో పాటు హెచ్‌ఈఓలు అసలే లేకపోవడంతో సేవలకు అంతరాయం ఏర్పడుతోంది. జిల్లాలోని 17 మండలాల పరిధిలో బత్తాయి, సీతాఫలం, దానిమ్మ, సపోట, బొప్పాయి, మామిడి, నిమ్మ తదితర పండ్ల తోటలు సాగవుతున్నాయి. దేవరకద్ర, గండేడ్, మహమ్మదాబాద్, జడ్చర్ల, హన్వాడ, రాజాపూర్, నవాబ్‌పేట, కోయిల్‌కొండ తదితర మండలాల్లో 8,091 మంది రైతులు 17,287.18 ఎకరాల్లో వివిధ రకాల ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో 3,385 మంది రైతులు 11,056.26 ఎకరాల్లో పండ్ల తోటలు సాగవుతున్నాయి. వీటితోపాటు 962 మంది రైతులు 3,755 ఎకరాల్లో ఆయిల్‌పాం, 3,107 మంది రైతులు 1,559.24 ఎకరాల్లో వివిధ రకాల కూరగాయలు , 544 మంది రైతులు 885.46 ఎకరాల్లో మిరప, 63 మంది రైతులు 30 ఎకరాల్లో వివిధ రకాల పూల తోటలు సాగు చేస్తున్నారు.

ఆయిల్‌పాం సాగుకు ఆసక్తి..

సంప్రదాయ పంటల సాగుతో విసిగి వేసారిన రైతులు ప్రస్తుతం పండ్ల తోటలు, వాణిజ్య పంటల సాగుపై దృష్టి సారిస్తున్నారు. కూరగాయల సాగు కూడా పెరుగుతుంది. ఇందుకు ఉదాహరణగా ఆయిల్‌పాం సాగునే పేర్కొనవచ్చు. ఉమ్మడి గండేడ్ మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా 5 ఎకరాల్లో ఒక రైతుతో ఆయిల్‌పాం సాగు ప్రారంభంకాగా.. ప్రస్తుతం 65 మంది రైతులు 238.96 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మండలంలోని 16 గ్రామాల్లో ఈ తోటలున్నాయి. ప్రభుత్వం డ్రిప్ పరికరాలను ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా, బీసీ, సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం, ఇతర కులాల రైతులకు 80 శాతం రాయితీపై అందజేస్తుంది. దీంతో రాను రాను ఆయిల్‌పాం సాగు పెరుగుతోంది. బొప్పాయికి కూడా డిమాండ్ ఉండటంతో సాగు విస్తరిస్తోంది. మొక్కల కొనుగోలుకు రాయితీతో పాటు తోటలకు నిర్వహణ ఖర్చు చెల్లిస్తుండటం కూడా విస్తీర్ణం పెరిగేందుకు కారణంగా చెప్పవచ్చు. రోజురోజుకు ఉద్యాన సాగు పెరుగుతున్నా సలహాలు, సూచనలు అందించేందుకు సిబ్బంది లేరు.


పగిడ్యాల్‌లో సాగుచేసిన డ్రాగన్ ఫ్రూట్ తోట

సాగు విస్తీర్ణం ఇలా..

తోట	విస్తీర్ణం (ఎకరాల్లో..)
నిమ్మ	48.39
సీతాఫలం	116.02
మామిడి	8,841
బొప్పాయి	141
దానిమ్మ	291.34
సపోట	145.12
బత్తాయి	684.05
డ్రాగన్ ఫ్రూట్	53.22

అందని సలహాలు, సూచనలు..

సిబ్బంది కొరత కారణంగా క్షేత్రస్థాయిలో రైతులకు సలహాలు, సూచనలు అందడం కష్టంగా మారింది. ఉన్న సిబ్బంది నిత్యం చేసే పనులకే పరిమితం అవుతున్నారు. అవసరమైన రైతులు ప్రత్యేకంగా వారి వద్దకు వెళ్లి అడిగితే తప్పా సలహాలు, సూచనలు ఇవ్వలేకపోతున్నారు. గతంలో గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటుచేసి పంటల సాగును ప్రోత్సాహించేవారు. ప్రస్తుతం మండల కేంద్రాల్లో జరిగే సర్వసభ్య సమావేశాలకు హాజరుకావడం తప్పా క్షేత్రస్థాయిలో పర్యటించలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మండలానికి ఒక ఉద్యాన అధికారిని నియమించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.


అడ్డాకుల మండలం వర్నెలో ఆయిల్‌పాం, మిర్చి సాగుపై సూచనలిస్తున్న హెచ్‌ఓ మహేందర్ (ఫైల్)

17 మండలాలు.. ముగ్గురు అధికారులు..

జిల్లాలో 17 మండలాలు ఉండగా.. కేవలం దేవరకద్ర, జడ్చర్ల, మహబూబ్‌నగర్‌కు మాత్రమే ఉద్యాన అధికారులు ఉన్నారు. వీరే జిల్లా మొత్తం సేవలందించాలి. గండేడ్, నవాబ్‌పేట, రాజాపూర్, మహబూబ్‌నగర్, హన్వాడ, దేవరకద్ర, జడ్చర్ల తదితర మండలాల్లో పండ్ల తోటలు ఎక్కువగా సాగవుతున్నా హార్టికల్చర్ అధికారుల నియామకం జరగలేదు. ఒక్కో అధికారికి 5 నుంచి 6 మండలాల అదనపు బాధ్యతలు అప్పగించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న అధికారులకు సర్వేలు, సమావేశాలకే సమయం సరిపోక పడరాని పాట్లు పడుతున్నారు.

హెచ్‌ఈఓలు లేక ఇబ్బందులు..

ఉద్యాన అధికారులతో పాటు ఉద్యాన విస్తరణ అధికారులు గతంలో గ్రామాల్లో సేవలు అందించేవారు. గతంలో జిల్లాలో 8 మంది హెచ్‌ఈఓలు కాంట్రాక్టు పద్ధతిలో నియమింపబడ్డారు. కరోనా సమయంలో హెచ్‌ఈఓలను తొలగించడంతో భారమంతా ఉద్యాన అధికారులపై పడటంతో పని భారంతో తల్లడిల్లుతున్నారు.

అధికారిని నియమించాలి



గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లో మామిడి, బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్ తదితర పండ్ల తోటలతో పాటు ఆయిల్‌పాం, కూరగాయలు సాగవుతున్నాయి. వీటికి సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నా, నాణ్యమైన దిగుబడులు తీయాలన్నా ఉద్యాన అధికారి సూచనలు అవసరం. గండేడ్‌కు ప్రత్యేకంగా అధికారి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. సాగులో మెళకువలు, శాస్త్రీయ పద్ధతులు తెలియక అధిక దిగుబడుల సాధన కష్టంగా మారింది. మండలస్థాయిలో హార్టికల్చర్ అధికారిని నియమించాలి.

– నర్సిములుగౌడ్, మామిడి రైతు, వెన్నాచేడ్

ఉన్నవారితోనే సేవలందిస్తున్నాం



జిల్లాలో ఉన్న ముగ్గురు ఉద్యాన అధికారులతోనే రైతులకు సేవలు అందిస్తున్నాం. సిబ్బంది కొరత విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. హెచ్‌ఈఓలు ఉంటే మరింత మెరుగైన సేవలు అందించే అవకాశం ఉండేది. అయినా రైతులకు సకాలంలో సూచనలు, సలహాలు అందించడంతో పాటు సాగు విస్తీర్ణం పెంచేందుకు కృషి చేస్తున్నాం.

– వేణుగోపాల్, డీడీ, హార్టికల్చర్, మహబూబ్‌నగర్

నిలిచిన విద్యుదుత్పత్తి


నెట్టెంపాడు నీటి పంపింగ్

ధరూరు/ రాజోళి: జూరాల జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో ఒక యూనిట్‌లో కొనసాగుతున్న విద్యుదుత్పత్తిని నీటి కొరత కారణంగా నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా.. సోమవారం ప్రాజెక్టుకు 6 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్టు వస్తున్న ఇన్‌ఫ్లో 3,200 క్యూసెక్కులు తగ్గింది. దీంతో నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 730, కుడి కాల్వకు 530, భీమా లిఫ్ట్–1కు 630, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 100, సమాంతర కాల్వకు 950 క్యూసెక్కులు వదలగా.. మరో 71 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 9.398 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఒక గేటు ద్వారా నీటి విడుదల

సుంకేసుల నుంచి ఒక గేటు ద్వారా నీటిని విడుదల చేస్తున్నట్లు జేఈ మహేంద్ర తెలిపారు. మంగళవారం ఎగువ నుంచి 6,940 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రాగా.. 4,479 క్యూసెక్కులు దిగువకు వదిలి.. 2,445 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు వదిలామని చెప్పారు.

నిలకడగా రామన్‌పాడు నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో మంగళవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగుల వద్ద నిలకడగా ఉంది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 730 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 871 క్యూసెక్కుల ఇన్ ఫ్లో కొనసాగుతుంది. జలాశయం నుంచి ఎన్టీఆర్ కాల్వ ద్వారా 911 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వల ద్వారా 25 క్యూసెక్కులు, వివిధ లిఫ్టుల ద్వారా 729 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.

కారు ఢీకొని యువకుడి దుర్మరణం

- నెల వ్యవధిలోనే తండ్రి, కుమారుడు..


శ్రీనివాస్(ఫైల్)

కోస్గి: కారు ఢీకొని ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండల పరిధిలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. నెల రోజుల వ్యవధిలోనే తండ్రి అనారోగ్యంతో, కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబంలో రోదనలు మిన్నంటాయి. బాధితులు, స్థానికుల కథనం మేరకు.. మండలంలోని చంద్రవంచకు చెందిన వడ్డె శ్రీనివాస్ (40) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. పండిన ధాన్యాన్ని బియ్యంగా మార్చేందుకు గ్రామ శివారులోని రైస్ మిల్లుకు తరలించాడు. తన బైక్‌పై గ్రామం నుంచి రైస్ మిల్లుకు వెళ్తుండగా తాండూర్ నుంచి కోస్గి వైపు వస్తున్న కారు బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

కారును వెంబడించిన పోలీసులు..

బైక్‌ను ఢీకొన్న కారు ఆగకుండా వెళ్లడంతో ఘటన స్థలంలో ఉన్న కొందరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానిక శివాజీ చౌరస్తాలో ఉన్న పోలీసులను తప్పించుకొని నారాయణపేట వైపు వెళ్లే క్రమంలో బస్టాండ్ సమీపంలో ఒకరికి, ఏబీకే ఫంక్షన్ హాల్ ఎదుట బైక్‌పై వెళ్తున్న మరొకరికి త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. పోలీసులు చాకచక్యంగా భోగారం, భక్తిమళ్లలో కొందరు యువతను అప్రమత్తం చేయడంతో రోడ్డుకు అడ్డంగా రాళ్లు, బైక్‌లు నిలుపడంతో కారు నిలిపాడు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకోగా.. వారు కొత్తపల్లికి చెందిన యువకులుగా గుర్తించారు.

మగదిక్కును కోల్పోయిన కుటుంబం...

శ్రీనివాస్ తండ్రి వడ్డె రామయ్య అనారోగ్యంతో నెల కిందటే మృతిచెందాడు. తండ్రి మరణం తర్వాత కొలుకుంటున్న క్రమంలో ఉన్న ఒక్కగానొక్క కుమారుడు కారు ఢీకొని మృతిచెందాడు. తల్లి అంజిలమ్మ, భార్య పుష్పమ్మతో పాటు ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబం మగదిక్కును కోల్పోయి పెట్టిన రోధనలు పలువురిని కంటతడి పెట్టించాయి. భార్య పుష్పమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జాతీయ రహదారి దాటుతుండగా..


పాత్లావత్ హీర్యా (ఫైల్)

రాజాపూర్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవి కథనం మేరకు.. మండలంలోని మల్లేపల్లి గ్రామపంచాయతీ సోమ్లాతండాకు చెందిన పాత్లావత్ హీర్యా (49) సొంత పని నిమిత్తం రాజాపూర్‌కు వచ్చారు. పని ముగించుకొని తిరిగి తండాకు వెళ్లేందుకు మండల కేంద్రంలోని పెట్రోల్‌బంక్ వద్ద జాతీయ రహదారిని నడుచుకుంటూ దాటుతుండగా జడ్చర్ల వైపు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడు కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

నైతిక విలువలతో కూడిన విద్యకు కృషిచేద్దాం

ఖిల్లాఘనపురం: ప్రతి ఒక్కరం బాపు బాటలో పయనించి.. నైతిక, ఆధ్యాత్మిక విలువలతో కూడిన విద్య కోసం కృషిచేద్దామని రిటైర్డ్ డీఈఓ విజయ్ కుమార్ అన్నారు. ఆయన పిల్లల భవిత కోసం గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో సత్యశోధన యాత్రలో భాగంగా చేపట్టిన పాదయాత్ర మంగళవారం ఖిల్లాఘనపురం చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతోపాటు తెలుగు, ఇంగ్లిష్ మీడియం కేజీబీవీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ బాటలో సత్యశోధన యాత్రలను అక్టోబర్ 2న జోగుళాంబ ఆలయం నుంచి ప్రారంభించానన్నారు. ఈ యాత్రను వందరోజులపాటు కొనసాగించి.. వెయ్యి కి.మీ., తిరిగి 2025 జనవరి 12న అచ్చంపేట సమీపంలోని ఉమామహేశ్వర ఆలయం వద్ద ముగింపు కార్యక్రమం నిర్వహిస్తానన్నారు. ఈ యాత్ర ముఖ్య ఉద్దేశం చేనేత వస్త్రాలను ప్రోత్సహించడం, మద్యం, మత్తు మందు వాడకాలను నివారించడం, స్వదేశీ వైద్యం (ఆయుర్వేదం)ను ఆదరించడం, సేంద్రియ వ్యవసాయాన్ని అభివృద్ధిపరచడం, యోగా, పౌష్టికాహారం, సంపూర్ణ ఆరోగ్యం వైపు మరల్చడం, ప్రకృతి, పర్యావరణం, జీవవైవిధ్యాన్ని కాపాడటం, పని, సంస్కృతిని పెంపొందించడం, సత్యం, అహింస పునాదులుగా సమసమాజ స్థాపన కోసం అడుగు వేద్దామన్నారు. బుధవారం ఖిల్లాఘనపూర్ నుంచి సోళీపురం మీదుగా యాత్ర కొనసాగుతుందని చెప్పారు.


ఖిల్లాఘనపూర్‌లో రిటైర్డ్ డీఈఓ విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై విచారణ

ఇటిక్యాల: ఇటీవల నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు విచారణ నిమిత్తం గద్వాల డీఎస్పీ సత్యనారాయణ మంగళవారం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. తహసీల్దార్ నరేందర్‌పై ఇటీవల కార్యాలయంలో జరిగిన దాడి సంఘటనలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులో భాగంగా కార్యాలయంలోని 14 మంది సిబ్బందిని డీఎస్పీ ఒక్కొక్కరిగా విచారించి వివరాలు నమోదు చేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ చట్టం దృష్టిలో అందరూ సమానమేనని.. నేరం చేసిన వారిని చట్టం తప్పకుండా శిక్షిస్తుందని పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ వెంకటేష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి

జడ్చర్ల: ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతిచెందిన ఘటన మండలంలోని గంగాపూర్ శివారులో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. సీఐ ఆదిరెడ్డి కథనం మేరకు.. అమ్మపల్లికి చెందిన మల్లేశ్(36) దుందుభి వాగు నుంచి ఇసుకను అక్రమంగా గంగాపూర్ శివారులోని ఓ వెంచర్‌లో డంప్‌చేశాడు. అనంతరం తిరిగి వెళ్తుండగా అదే వెంచర్‌లో రోడ్డుపై ధాన్యం కుప్పను ఢీకొట్టడంతో ట్రాక్టర్ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ట్రాక్టర్ చక్రాల కింద పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


మల్లేశ్ (ఫైల్)

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

అడ్డాకుల: వరి పండించిన రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీసీ ద్వారా రైతులకు సూచించారు. మూసాపేట మండలం పోల్కంపల్లి గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం వీసీ ద్వారా స్థానిక రైతులు, వ్యవసాయశాఖ అధికారులతో మంత్రి మాట్లాడారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించి ప్రభుత్వం నుంచి క్వింటాల్‌కు రూ.500 బోనస్ పొందిన రైతులతో మంత్రి మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధరతో పాటు బోనస్ చెల్లించడం ద్వారా రైతులకు మేలు జరుగుతోందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి బి.వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో 1.94 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారని, 4.45లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తున్నట్లు అంచనా వేశామన్నారు. ఇందులో 2.76లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని వివరించారు. డీసీఓ శంకరాచారి, సివిల్ సప్లయ్ డీఎం ఇర్ఫాన్, ఏడీఏ యశ్వంత్‌రావు, ఏఓ అనిల్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఈఓ శివ, సీఈఓ భాస్కర్‌గౌడ్ ఉన్నారు.


పోల్కంపల్లిలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మలతో వీసీలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారులు

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- ఇద్దరి అరెస్ట్.. బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం

మద్దూరు: మండల కేంద్రంలో నెల కిందట జరిగిన చోరీ కేసును ఛేదించి నిందితుల నుంచి బంగారు ఆభరణాలు, 3 సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను రికవరీ చేసినట్లు డీఎస్పీ లింగయ్య తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి పూర్తి వివరాలు వెల్లడించారు. మండలంలోని చింతల్‌దిన్నెకు చెందిన పోతుల లత, పోతుల కృష్ణ దంపతులు కొంతకాలంగా మండల కేంద్రంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని ఉంటున్నారు. గత నెల 21న భార్యాభర్తలు ఇంట్లో లేని సమయంలో తలుపునకు వేసిన తాళం పగులకొట్టి బీరువాలో భద్రపర్చిన 6.50 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న మద్దూరు పోలీసులు సాంకేతికత ఆధారంగా గద్వాల జిల్లా మల్దకల్ మండలం తాటికుంటకు చెందిన బోయ నర్సింహులు తండ్రి లక్ష్మన్న, బోయ నర్సింహులు తండ్రి రాములుగా అనుమానించారు. వీరిని పట్టుకొని విచారించగా వారే దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. వీరు గతంలో ధన్వాడ, నారాయణపేట పోలీస్‌స్టేషన్ల పరిధిలో నేరాలు చేశారు. వీరి నుంచి బంగారు ఆభరణాలు, మూడు సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన కోస్గి సీఐ దస్రునాయక్, ఎస్‌ఐ రాంలాల్, హెడ్ కానిస్టేబుల్ వసురాంనాయక్, పోలీసులు భీమప్ప, పుల్యానాయక్‌ను అభినందించి రివార్డు అందజేశారు.


మాట్లాడుతున్న డీఎస్పీ లింగయ్య

వింత వ్యాధితో కాళ్లకు ఇన్‌ఫెక్షన్

- వైద్యం కోసం రూ.లక్షల్లో ఖర్చు
- ఆపన్నహస్తం కోసం బాధితుడి ఎదురుచూపు


ఉప్పరి రఘు

మాగనూర్: వింత వ్యాధితో కాళ్ల ఇన్‌ఫెక్షన్ గురై.. ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్న ఓ నిరుపేద వ్యక్తి.. వైద్యం కోసం రూ.లక్షల్లో ఖర్చు అవుతుందని.. ఆపన్న హస్తం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని తళంకేరి గ్రామానికి చెందిన ఉప్పరి రఘు అనే వ్యక్తికి వింత వ్యాధి సోకి కుడి కాలు ఇన్‌ఫెక్షన్‌కు గురైంది. దీంతో అనేక ఆస్పత్రుల్లో చూపించగా రూ.లక్షల్లో ఖర్చు అయ్యింది. అయితే ఈ వ్యాధి పూర్తిగా నయం కావాలంటే సుమారు రూ.6 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి డాక్టర్లు చెప్పారని బాధితుడు భార్య మహాదేవి వాపోయారు. నిరుపేద కుటుంబమైన తమకు రోజు గడవడమే కష్టంగా ఉందని, ఈ సమయంలో వింత వ్యాధి కారణంగా కుటుంబ పోషకుడు ఆస్పత్రిలో చేరడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని బోరున విలపించారు. ఇప్పటికే తెలిసిన వారి దగ్గర అప్పులు చేసి వైద్యం అందించామని.. ప్రస్తుతం అప్పులు కూడా దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాతలు ఎవరైనా స్పందించి తన భర్తకు వైద్యం చేయించేందుకు ముందుకు రావాలని వేడుకుంటున్నారు. దయార్ద్ర హృదయులు ఫోన్ పే నం.76758 50569, ఏపీజీవీ బ్యాంక్ అకౌంట్ నంబర్ : 73180844778కు సహాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

బైపాస్ రోడ్డు సర్వే అడ్డగింత

తాడూరు: కల్వకుర్తి– నంద్యాల జాతీయ రహదారి–167కే తాడూరు బైపాస్ రద్దు చేసి గ్రామంలోనే ఉన్న రోడ్డును విస్తీర్ణం చేసుకొని వెళ్లేలా చూడాలని, బైపాస్ వేయడం వల్ల పేదల భూములు కోల్పోతున్నారని మంగళవారం సర్వే అధికారులను రైతులు అడ్డుకున్నారు. బైపాస్ రోడ్డు కోసం సర్వే నిర్వహించడం అడ్డుకొని తీరుతామని సర్వే చేయడానికి వచ్చిన ప్రతి ఒక్కరిని గత ప్రభుత్వం నుంచి కూడా రావొద్దని తాము విన్నవించామని రైతులు పేర్కొన్నారు. బైపాస్ వేయడం వల్ల దళిత కుటుంబాలకు చెందిన భూములు ఎక్కువగా కోల్పోతున్నారని, ఎకరాలోపు భూములు బైపాస్ రోడ్డులో కోల్పోవడంతో వారి జీవన విధానం కనుమరుగవుతుందన్నారు. తక్షణమే బైపాస్ రోడ్డు పనులు రద్దు చేయాలని, లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని రైతులు హెచ్చరించారు. మార్కెట్ విలువ ఎకరా రూ.కోటి పైనే ఉందని, బైపాస్ రూపకంగా తీసుకుంటే రైతులు నష్టపోతారన్నారు. ప్రభుత్వం రైతులకు భూమి ఉండేలా అవసరమైతేనే తీసుకోవాలి తప్ప అనవసరమైన బైపాస్ ఎంచుకొని తమను ప్రతిరోజు సర్వేల పేరుతో చిత్రహింసలు పెట్టడం సరి కాదన్నారు. బలవంతపు భూసేకరణను ఆపాలని రైతులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రైతులను సముదాయించారు.


పోలీసులతో గోడు విన్నవిస్తున్న రైతులు



సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech, డిప్లొమా, D&B- ఫార్మసీ, D.Ed(ఐచ్ఛ), B.Ed, B.P.Ed, MBA, MCA, B.Sc(Agri), B.Sc (నర్సింగ్), GNM. * వివరాలకు, 8666977112 [HA-16453]

BUSINESS OFFER

■ ప్రముఖ కంపెనీ అగ్రి, ప్రొపర్టీ, బిజినెస్ కొరకు ఏజెంట్స్ DMA, DSA కావలెను మంచి జీతం & కమిషన్. 7988242391 [SCA24000660]

WANTED

■ నర్మదా హోండా షోరూం వనపర్తిలో పనిచేయుటకు, సేల్స్ మేనేజర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, సర్వీస్ మేనేజర్, ఫ్లోర్ సూపర్ వైజర్, స్పేర్ పార్ట్స్ ఇంచార్జ్‌స్ కావలెను. సంప్రదించండి : 9440435060. [J-518]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి, మేనేజర్

తొలగింపు కుదరదు..
ఇకపై వద్దు

▶ మొదటి పేజీ తరువాయి



ప్రవేశపెట్టిన సర్వీస్ రూల్స్ ద్వారా భర్తీ చేస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ సర్వీస్ నిబంధనల్లోని రూల్ 3.. జూనియర్ లెక్చరర్ల పోస్టులను నోటిఫికేషన్ ఇచ్చి లేదా పదోన్నతితో భర్తీ చేయాలని చెబుతోంది. డిగ్రీ లెక్చరర్లకూ ఇలాంటి నిబంధనే వర్తిస్తుంది. మేమంతా జూనియర్, డిగ్రీ లెక్చరర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టులకు నిబంధనల మేరకు అర్హులం. జూనియర్, డిగ్రీ లెక్చరర్ల పోస్టులను కాలేజ్ సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ చేసేలా ఆంధ్రప్రదేశ్ కాలేజ్ సర్వీస్ కమిషన్ చట్టం 1985ను ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. అయితే, ఈ చట్టం 2001లో రద్దయింది. ఆ తర్వాత నుంచి పారదర్శక విధానం లేకుండా కాంట్రాక్టు విధానంలో ఎంపిక కమిటీ పోస్టులను భర్తీ చేయడం ప్రారంభించింది. 2002 తర్వాత నుంచి నేరుగా ఈ పోస్టులను భర్తీ చేయలేదు. ఈ క్రమంలో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ కోసం 2016, ఫిబ్రవరి 26న ప్రభుత్వం చట్టవిరుద్ధంగా సెక్షన్ 10ఏను చేరుస్తూ ప్రభుత్వం జీవో16ను తెచ్చింది. దీంతో అర్హతలు లేని వారు ప్రభుత్వ ఉద్యోగాలు పొందారు' అని పిటిషనర్లు వాదించారు.

విద్యాశాఖ వాదన..

'పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 101 మేరకు.. నిర్ణీత వ్యవధిలో ఇప్పటికే ఉన్న చట్టాన్ని సవరణ చేసే, రద్దు చేసే వీలు సర్కార్‌కు ఉంది. 2014, జూన్ 2కు ముందున్న వారినే క్రమబద్ధీకరణ, రిజర్వేషన్లు కూడా వర్తింపు.. ఇలా సెక్షన్ 10ఏలో ఆరు నిబంధనలు చేర్చి ఆ మేరకే క్రమబద్ధీకరించాం. భవిష్యత్తులో మరిన్ని పోస్టులను భర్తీ చేయనున్నందున నిరుద్యోగ యువత అవకాశాలను జీవో 16 నిర్వీర్యం చేస్తుందన్న పిటిషనర్ల ఆందోళన సరికాదు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా క్రమబద్ధీకరణ జరిగిందనడం అర్థరహితం. జీవో 16 మేరకున్న పోస్టులను 2023, ఏప్రిల్ 30న జీవో 38 ద్వారా క్రమబద్ధీకరించాం' అని విద్యాశాఖ పేర్కొంది. 5,544 మందిని క్రమబద్ధీకరిస్తే కొందరినే ప్రతివాదులుగా పేర్కొనడంపై అనధికారిక ప్రతివాదుల (క్రమబద్ధీకరించిన వారు) తరఫు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. దీన్ని పరిగణనలోకి తీసుకుని రిట్ పిటిషన్లను కొట్టివేయాలన్నారు.

శృంగేరి శారద పీఠానికి వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్డులోని శ్రీ శృంగేరీ శారద పీఠంలో జగద్గురువు శ్రీ విధుశేఖర భారతి స్వామిజీని మంగళవారం మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దర్శించుకున్నారు. పీఠంలోని ధార్మిక భవనంలో స్వామిజీ ఆశీర్వచనం తీసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. విజయ యాత్రలో భాగంగా స్వామిజీ దక్షిణాదిలోని 3 రాష్ట్రాల్లో 40 రోజుల పాటు పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా 18, 19 తేదీల్లో విజయవాడలోని శివరామకృష్ణ క్షేత్రంలో బస చేసిన ఆయనను వైఎస్ జగన్ కలిశారు. ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్, వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్లు అవుతు శైలజారెడ్డి, బెల్లం దుర్గ తదితరులు జగన్ వెంట ఉన్నారు. వైఎస్ జగన్ రాకను తెలుసుకొని పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అక్కడికి చేరుకోవడంతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారింది. వీరందరికీ చిరునవ్వుతో వైఎస్ జగన్ అభివాదం చేశారు.



వైఎస్ జగన్‌కు ప్రసాదం అందిస్తున్న స్వామీజీ

పక్కకు ఒరిగిన భవనం

- హైదరాబాద్ మాదాపూర్ సమీపంలో కలకలం
- నాలుగంతస్తుల భవనంలోని అందరూ సురక్షితం

గచ్చిబౌలి (హైదరాబాద్): రాజధాని నగరంలోని మాదాపూర్ ఐటీ కారిడార్‌కు చెంతనే ఉన్న సిద్దిఖీనగర్‌లో నాలుగు అంతస్తుల భవనం పక్కకు ఒరిగిన ఘటన కలకలం రేపింది. వసుకుల లక్ష్మణ్ అనే వ్యక్తి ప్లాట్ నం. 1639లో 70 గజాల స్థలంలో జీప్లస్ ఫోర్ భవనాన్ని నిర్మించారు. ఫ్లోర్‌కు రెండు పోర్షన్ల చొప్పున నాలుగు ఫ్లోర్లు నిర్మాణం చేశారు. ఆ భవనంలో మొత్తం 48 మంది అద్దెకు ఉంటున్నారు. వారంతా చెంతనే ఉండే ఐటీ కంపెనీల్లో హౌస్‌కీపింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం సాయంత్రం 7 గంటల సమయంలో గోడ కూలినట్లు శబ్దం వచ్చినా ఎవరూ పట్టించుకోలేదు. కానీ రాత్రి 8.30 గంటల సమయంలో పెద్దగా శబ్దం వచ్చి భవనం ఒరిగిపోతోందని అరుపులు వినిపించడంతో అందరూ భయాందోళనలకు గురయ్యారు. ప్రాణాలు అరచేతిలో పట్టుకొని ఆదరాబాదరాగా కిందకు వచ్చేశారు. ఇంతలోనే మూడో అంతస్తులో ఉండే సాదిక్ హుస్సేన్ కిందికి దూకగా అతనికి తీవ్ర గాయాలయ్యాయి. ఈలోగా అందరూ కిందకు వచ్చేయడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే భవనం నిర్మించినట్లు తెలుస్తోంది.


పక్క స్థలంలో గుంతలు తీయడంతోనేనా..

ఈ భవనం పక్కనే ఉండే 1605, 1638 ప్లాట్లను కలిపి భవనం నిర్మించేందుకు పిల్లర్లు వేయడానికి గుంతలు తవ్వారు. వీటితో భవనానికి ఇబ్బంది వస్తుందని ఈ భవన యజమాని వారిని హెచ్చరించారు. అయినా వారు వినలేదు. దీనివల్లే ఈ



ఒరిగిన భవనం

భవనం పరిస్థితి ఇలా మారిందని కొందరు అంటున్నారు. ఘటనా స్థలాన్ని జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, శేరిలింగంపల్లి టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వెంకటరమణ, మాదాపూర్ ఏసీపీ శ్రీకాంత్, డీఆర్‌ఎఫ్ సిబ్బంది పరిశీలించారు. పక్కకు ఒరిగిన భవనం చుట్టూ ఉండే పది భవనాల్లో నివాసం ఉండేవారిని ముందు జాగ్రత్త చర్యగా ఖాళీ చేయించి వేరేచోటికి తరలించారు. ఈ



భవనాన్ని ఆనుకొని తీసిన గుంత

భవనం ముందు కేవలం పదిఫీట్ల రోడ్డు మాత్రమే ఉంది. భవనాన్ని ఇంజనీర్లు పరిశీలించి నాణ్యతను నిర్ణయిస్తారని, వారి నివేదిక ఆధారంగా ఒరిగిన భవనాన్ని తొలగిస్తామని ఉపేందర్‌రెడ్డి వెల్లడించారు. అలాగే ఈ భవనం వెనుక లోతైన గుంతలు తీసిన బిల్డర్‌పైనా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

భవనం విరిగిందని అరుపులు వినిపించడంతో వచ్చేశా..

'మేము మొదటి అంతస్తులో ఉంటున్నాం. రాత్రి 8.30 గంటల సమయంలో శబ్దం వచ్చింది. కొద్దిసేపటికే ఇంట్లోని సామాన్లు కిందపడిపోవడం ప్రారంభమైంది. అదే సమయంలో భవనం విరిగిందని అరుపులు వినిపించడంతో వంట చేస్తున్న స్టవ్ ఆర్పకుండానే భయంతో కిందికి వచ్చేశా' అని జహారుల్ చెప్పారు.

బందోబస్తు మధ్య
'ఫ్యూచర్' రోడ్డుకు సర్వే

- గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణం కోసం కొంగరకలాన్ నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు భూసేకరణ
- పరిహారం చెల్లింపు విషయంలో స్పష్టత కరువు
- రైతులు, మహిళల నిరసన

కందుకూరు/ఇబ్రహీంపట్నం రూరల్: ఫ్యూచర్ సిటీ ఏర్పాటులో భాగంగా ప్రభుత్వం చేపట్టిన గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు సర్వే పనులను మంగళవారం పోలీసు బందోబస్తు మధ్య చేపట్టారు. ఈ సందర్భంగా భూములు ఇచ్చి తామెక్కడికి వెళ్లాలంటూ రైతులు ఆవేదన వెలిబుచ్చారు. భూములు కోల్పోతున్న వారికి ఎంత పరిహారం ఇస్తారు? ఎలా న్యాయం చేస్తారో చెప్పకుండా పోలీసులతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారులు సర్వే చేస్తుండగా.. కొంగరకలాన్‌లో కలెక్టరేట్ వెనక వైపు చేపట్టిన సర్వే పనులను అడ్డుకుని మహిళలు నిరసన తెలిపారు. రాజు అనే యువ రైతు తమ భూమి తీసుకుంటే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. దీంతో పోలీసులు అతన్ని సముదాయించి అక్కడి నుంచి పంపించారు.

330 అడుగుల రహదారి

రంగారెడ్డి జిల్లా కందుకూరు, యాచారం మండలాల్లో గత ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీని నిర్మించడానికి సిద్ధమైన విషయం తెలిసిందే. అక్కడికి చేరుకునేలా ఓఆర్ఆర్ ఎగ్జిట్ 13 నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు 330 అడుగుల రహదారి నిర్మాణానికి ప్రతిపాదించింది. ఇందుకోసం ఇబ్రహీంపట్నం మండలం కొంగరకలాన్, మహేశ్వరం మండలం కొంగరకుర్దు, కందుకూరు మండలం లేమూరు, తిమ్మాపూర్, రాచులూరు, గుమ్మడవెల్లిలో రిజర్వు ఫారెస్ట్, పంజగూడ,



కొంగరకలాన్ రెవెన్యూలో సర్వే చేయడానికి వచ్చిన అధికారులతో వాగ్వాదం చేస్తున్న రైతులు

మీర్‌ఖాన్‌పేటలో కలిపి మొత్తం 449.27 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించింది. ఫ్యూచర్ సిటీ రోడ్డు కోసం ఇటువైపు కందుకూరు మండలం రాచులూరుతోపాటు అటువైపు ఇబ్రహీంపట్నం మండలం కొంగరకలాన్‌లో అధికారులు ఏకకాలంలో సర్వే పనులు ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, కందుకూరు తహసీల్దార్ గోపాల్, మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి పర్యవేక్షణలో సీఐలు సీతారామ్, వెంకట్‌తోపాటు పోలీసుల బందోబస్తు నడుమ సర్వే నిర్వహించారు. అక్కడి రైతులు అధికారులకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. అంత పెద్ద రోడ్డు నిర్మిస్తే పొలాలు మొత్తం పోయి, రోడ్డున పడాల్సి వస్తుందని వాపోయారు. సమావేశం ఏర్పాటు చేసి తర్వాత వివరాలు వెల్లడిస్తామని చెప్పి అధికారులు సర్వేను కొనసాగించారు.

పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీల రిజర్వేషన్లు పెంచాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

విజయనగర్ కాలనీ: పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీల రిజర్వేషన్‌ను 22 నుంచి 42 శాతం వరకు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. మంగళవారం మాసబ్‌ట్యాంక్ దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్‌లోని డెడికేటెడ్ బీసీ కమిషన్ చైర్మన్ బి.వెంకటేశ్వరరావును బీసీ నాయకులతో కలిశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం డెడికేటెడ్ బీసీ కమిషన్‌ను నియమించాలని, దీనికి విస్తృతమైన, న్యాయపరమైన, రాజ్యాంగపరమైన అధికారాలున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర కులగణన చేసి దాని ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచితే న్యాయపరమైన, చట్టపరమైన అవరోధాలుండవని చెప్పారు. అగ్ర కులాలకు విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు పెట్టినప్పుడు 50 శాతం సీలింగ్ కాలం చెల్లిన



డెడికేటెడ్ బీసీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆర్.కృష్ణయ్య తదితరులు

విధానమని సుప్రీంకోర్టు తెలిపిందన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకుడు గుజ్జ కృష్ణ, జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, వేముల రామకృష్ణ, గౌరిగె మల్లేశ్, జిల్లపల్లి అంజి, సతీశ్, అల్లంపల్లి రామకోటి, వీరన్న, అనంతయ్య, సి.రాజేందర్, జయంతి, రాఘవేందర్, వంశీకృష్ణ, రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ టెండర్లు వాయిదా

ఊర్కొండ: ఊర్కొండపేటలోని పబ్బతి ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం జరగాల్సిన టెండర్లు వాయిదా వేసినట్లు ఈవో సత్యచంద్రారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయం సంవత్సరపు టెండర్ల ప్రక్రియ దేవాదాయ శాఖ మహబూబ్‌నగర్ కార్యాలయంలో బుధవారం జరగాల్సి ఉండగా టెండర్ల ప్రక్రియను వాయిదా వేస్తున్నామని, తర్వాత నిర్వహించే తేదీని త్వరలోనే ప్రకటిస్తామని ఈఓ చెప్పారు.

రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన

- టీపీసీసీ ఉపాధ్యక్షులు, టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్



స్టేషన్ మహబూబ్‌నగర్: మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన రాష్ట్రాన్ని పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లాకేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం రూ.7లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పగించిందన్నారు. అప్పులతో ఉన్న రాష్ట్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం గాడిన పెడుతూ ప్రజాసంక్షేమ పాలన చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. యువతలో నైపుణ్యాభివృద్ధి కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఐటీఐలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేస్తే ఉపాధికి బాటలు వేస్తున్నట్లు తెలిపారు. యూనివర్సిటీల్లో మౌలిక వసతుల కల్పనకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు అడ్డుపడుతున్నాయని ఆరోపించారు. ఈ రెండు పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రంలో సంక్షేమ పాలన ఆగదని అన్నారు. సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్, నాయకులు చంద్రకుమార్‌గౌడ్, సీజే బెనహర్, గంజి ఆంజనేయులు, అజ్మత్‌అలీ, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

దక్షిణకాశీలో వైభవంగా ఆరుద్రోత్సవం



అన్నంతో లింగాకృతిలో అలరిస్తున్న బాలబ్రహ్మేశ్వరుడు



ఆలయంలో భక్తుల రద్దీ



గోసహిత ఆలయ ప్రదక్షిణలు



రససిద్ధి గణపతికి పూజలు చేస్తున్న భక్తులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ పుణ్యక్షేత్రంలోని జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఆరుద్రోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్తీకమాసం, పరమేశ్వరుడికి ప్రీతికరమైన నక్షత్రం ఆరుద్ర కావడంతో భక్తులు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఉదయం కపిల గోవుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంగళవాయిద్యాలు, పండితుల వేదమంత్రోచ్ఛరణాలు, భక్తుల దైవ నామస్మరణ మధ్య గో సహితంగా ఆలయ ప్రాకార మండపం, గోమాత చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

రససిద్ధి గణపతికి ప్రత్యేక పూజలు

ముఖ మండపంలో కొలువుదీరిన రససిద్ధి గణపతికి భక్తులు పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు, హరిద్ర లేపనంతో అలంకరణ చేశారు. అష్టోత్తర శతనామాలు, పుష్పాలు అర్పించారు. గణపతి పూజ అనంతరం వేదపండితులు మహన్యాస పారాయణం గావించారు. భక్తుల చేత అగన్యాస కరణ్యాసాలు జరిపారు.

ఏకాదశ రుద్రాభిషేకాలు

గర్భాలయంలో కొలువుదీరిన బ్రహ్మేశ్వరుడికి భక్తులు 11 పర్యాయాలు పంచామృతాలు, కొబ్బరి కాయలు, పళ్ల రసాలతో అభిషేకాలు చేశారు. అర్చకులు రుద్ర నమక చమకాలను వల్లె వేశారు. అన్న సూక్త పారాయణం చేస్తూ స్వామివారికి అన్నంతో అభిషేకాలు చేసి లింగాకృతిలో అలంకరించారు. బిల్వ దళాలు, వివిధ పుష్పాలతో అలంకరించి విగ్రహం చుట్టూ కార్తీక దీపాలు వెలిగించడంతో గర్భాలయం దేదీప్యమానంగా వెలుగొందింది. ఏక, నేత్ర, బిల్వ, వేద, కుంభ, రథ, నక్షత్ర, చక్ర హారతులతో దశవిధ హారతులు సమర్పించారు. కార్యక్రమంలో ఈఓ పురేందర్‌కుమార్, ప్రధాన అర్చకులు ఆనంద్‌శర్మ, ముఖ్య అర్చకులు శ్రీకాంత్ శర్మ, సహాయకులు ధనంజయశర్మ, పృథ్వీనాథశర్మ, కృష్ణమూర్తిశర్మ, ప్రహ్లాదచారి, త్యాగరాజు శర్మ తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ

- కురుమూర్తికి తరలివస్తున్న భక్తజనం
- జాతర మైదానం కిటకిట

చిన్నచింతకుంట: కురుమూర్తిస్వామి జాతరను పురస్కరించుకొని వివిధ ప్రాంతాల నుంచి నిత్యం భక్తులు వేల సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మెట్లపై కొబ్బరికాయలు కొట్టి గోవింద నామస్మరణతో స్వామివారిని దర్శించుకున్నారు.



కురుమూర్తిస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కొందరు భక్తులు మట్టికుండలో నైవేద్యం తయారు చేసి దాసంగాలు పెట్టి వేడుకున్నారు. తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

■ కురుమూర్తిస్వామిని బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కొండ దిగువన ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి బీజేపీ తరఫున సహకారం అందిస్తామన్నారు. ఆయన వెంట పార్టీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి నంబిరాజు తదితరులున్నారు.



మెట్లపై దీపాలు వెలిగిస్తున్న మహిళలు



జాతర మైదానంలో భక్తుల రద్దీ

హిందూ సంస్కృతిని కాపాడుకోవాలి

అడ్డాకుల: హిందూ సంస్కృతిని కాపాడుకునేందుకు అందరూ ముందుకు రావాలని 1008 కాశీ జగద్గురు జ్ఞాన సింహాసనాధీశ్వర డాక్టర్ చంద్రశేఖర శివాచార్య అన్నారు. మూసాపేటలోని రామస్వామి గుట్టపై వెలసిన శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్వామిని గుట్టపై ఉన్న ఆలయం వద్ద మెట్ల మీదుగా పల్లకీలో గుట్టపైకి తీసుకెళ్లారు. ఆలయం లోపల పూజలు చేసిన తర్వాత భక్తులనుద్దేశించి మాట్లాడారు. ఇక్కడి సంకల్పసిద్ధి ప్రదేశం శ్రీరాముడు స్థాపించిన అత్యంత ప్రాచీనమైనదన్నారు. శివుడికి పూజ చేయడం అనేక యుగాల నుంచి వస్తుందన్నారు. శ్రీరాముడు లంకలో రావణుడిపై విజయం సాధించిన తర్వాత బ్రహ్మ హత్య దోషం రావడంతో దాన్ని తొలగించుకోవడానికి శ్రీశైలంలో సహస్ర లింగ స్థాపన చేశారు. అదే సమయంలో అనేక ప్రాంతాల్లో లింగ స్థాపన చేశారని, ఇక్కడ కూడా శ్రీరాముడే స్థాపన చేశారని పేర్కొన్నారు. సంకల్పసిద్ధి రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని, తనకు ఇక్కడ ఓ కోరిక తీరిందని స్వామిజీ చెప్పారు. ఇక్కడ శ్రీరాముడు సంకల్పసిద్ధిని స్థాపించినందుకు రామలింగేశ్వర స్వామి అనే పేరు వచ్చిందన్నారు. వృద్ధాప్య దశలో ఉన్న వారికి సేవ చేయాలని యువతకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నరేందర్, భక్తులు పాల్గొన్నారు.



భక్తులకు ఆశీర్వచనం ఇస్తున్న కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య

డబ్లింగ్ పనులు వేగవంతం చేయండి



దేవరకద్రలో డీఆర్‌ఎం లోకేష్ విష్ణోయ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దేవరకద్ర: డబ్లింగ్ పనులు వేగవంతం చేయాలని దక్షిణమధ్య రైల్వే డీఆర్‌ఎం లోకేష్ విష్ణోయ్ అన్నారు. మంగళవారం దేవరకద్ర, మన్యంకొండ, మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌లను ఆయన సందర్శించి.. పనులను పరిశీలించారు. ఇప్పటికే మహబూబ్‌నగర్ వరకు డబ్లింగ్ పనులు పూర్తయ్యావని, ఇక్కడి నుంచి డోన్ వరకు పనులు ప్రారంభమయ్యావని, వీటిని త్వరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. డబ్లింగ్ పనులు పూర్తయితే రైళ్ల వేగం పెరుగుతుందన్నారు. రైల్వేస్టేషన్లను ఆధునీకరించే పనులు కొనసాగుతున్నాయని, అధునాతన సౌకర్యాలతో రైల్వేస్టేషన్లను తీర్చిదిద్దుతామని చెప్పారు. అలాగే దేవరకద్ర రైల్వేస్టేషన్‌లో నెలకొన్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సిగ్నల్ సమస్య, డబ్లింగ్ పనుల పరిశీలన, పరిసరాలు, ప్రయాణికుల సౌకర్యాల గురించి ఆరాతీశారు.

ఓవర్ బ్రిడ్జి పరిశీలన

దేవరకద్రలో రైల్వే ఓవర్ బ్రిడ్జిని డీఆర్‌ఎం లోకేష్ విష్ణోయ్ పరిశీలించారు. ఇక్కడి గేటు మూసివేయడం వల్ల పడుతున్న ఇబ్బందుల గురించి స్థానిక నాయకులు డీఆర్‌ఎంకు వివరించారు. సమస్యను అధిగమించేందుకు అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అలాగే దేవరకద్ర రైల్వేస్టేషన్‌లో సికింద్రాబాద్ నుంచి కర్నూలు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు 17023, గూంటూర్ నుంచి సికింద్రాబాద్ 17251 రైలు, కాచిగూడ నుంచి కర్నూలు వెళ్లే 17435 రైలు, హంద్రీ ఎక్స్‌ప్రెస్ 17027 రైలును ఆపాలని విన్నవించారు. దేవరకద్ర జంక్షన్ అయినా ప్రాధాన్యత ఇవ్వడం లేదని, వెంటనే రైళ్లను నిలిపి తగిన సౌకర్యాలు కల్పించాలని కోరారు. డీఆర్‌ఎంను కలిసిన వారిలో నాయకులు అంజిల్‌రెడ్డి, అంజన్‌కుమార్‌రెడ్డి, ఫారూఖ్, గోవర్ధన్‌రెడ్డి, జవహర్, ప్రభాకర్, కృష్ణంరాజు తదితరులున్నారు.